

రంజాన్ వేళలు

ఇఫ్తార్ | 6:38 ఆదివారం

సహర్ | 4:44 సోమవారం

మార్కెట్ యార్డుకు సెలవులు

జగిత్యాల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల వ్యవసాయ మార్కెట్ యార్డుకు మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ సెక్రటరీ రాజ శేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7వ తేదీ ఆదివారం, 8వ తేదీ సోమవారం అమావాస్య, 9వ తేదీ మంగళవారం ఉగాది పండగ నేపథ్యంలో అడితి వ్యాపారుల విజ్ఞప్తి మేరకు సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు.

అప్పుడు పసుపు ఇప్పుడు గల్ఫ్ బోర్డు

జగిత్యాల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పార్లమెంట్ గత ఎన్నికల్లో పసుపు బోర్డు సమస్య మాదిరిగానే ప్రస్తుత పార్లమెంట్ ఎన్ని కల్లో గల్ఫ్ బోర్డు సమస్య తెరపైకి వచ్చింది. ఎన్నికల్లో పసుపు బోర్డు అంశం గెలుపోటములను ప్రభావితం చేసినట్లుగానే ప్రస్తుతం గల్ఫ్ బోర్డు అంశం ప్రభావితం చేయనుందన్న చర్చలు జరుగుతున్నాయి. గల్ఫ్ వలస కార్మికుల ఓట్లను రాబట్టుకోవడానికి ప్రధాన రాజకీయ పక్షాలు ఎత్తులు పై ఎత్తులు వేస్తున్నాయి. ఈ ఓటు బ్యాంకు కోసం గట్టి ప్రయత్నాలు చే స్తున్నాయి. ఈనేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి వచ్చే వారం రోజుల్లో గల్ఫ్ జేఏసీ సంఘాల ప్రతినిధులతో సమావేశం అయ్యేందుకు నిర్ణయించారు. ఈనెల 21వ తేదీన దుబాయిలో గల్ఫ్ ఓటర్లను ప్రభావితం చేసే సంఘా ల నాయకులతో బీజేపీ సమావేశం నిర్వహించడానికి ముహూర్తం ఖరారు చేసింది. ఏళ్ల తరబడి డిమాండ్ చేస్తున్న గల్ఫ్ సంక్షేమ బోర్డు, గల్ఫ్ పా లసీ సమస్యలు పరిష్కారం కావడం లేదని కార్మిక కుటుంబాలు వాపోతున్నాయి.



- పార్లమెంట్ ఎన్నికల సమయంలో తెరపైకి సమస్యలు
- ఎన్నికల్లో కీలకం కానున్న వలస కార్మికుల ఓట్లు
- ఓట్లు రాబట్టుకోడానికి దృష్టి సారిస్తున్న బీజేపీ, కాంగ్రెస్‌లు

గల్ఫ్ సంక్షేమ బోర్డు కోసం..

గల్ఫ్ కార్మిక కుటుంబాల వారు గల్ఫ్ సంక్షేమ బోర్డు, గల్ఫ్ పాలసీ కోసం ఏళ్ల తరబడి డిమాండ్ చేస్తున్నారు. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి ఎక్కువగా గల్ఫ్ కార్మికులున్నారు. కార్మికుల కుటుంబాల సంక్షేమ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవ డం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వలస కార్మికుల కోసం ప్రవాసీ విధానం (ఎన్ఆర్ఐ పాలసీ) అమలు చేయాలని కోరుతున్నారు. గల్ఫ్‌లోని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), సౌదీ అరేబియా, ఖతర్, ఒమన్, బహ్రెయిన్, కువైట్ దేశాలకు వలస వెళ్లిన కార్మికులు ప్రతీ సంవత్సరం భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఇక్కడికి పంపుతున్నారు. వలస వెళ్లిన కార్మికుల్లో ఎక్కువగా కూలీలుంటున్నారు. గల్ఫ్ దేశాల్లో మరణించిన వారి మృతదేహాలకు స్వగ్రామాలకు తరలించడానికి సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గల్ఫ్‌యేతర దేశాల్లో మరణించిన వారి మృతదేహాలు రాష్ట్ర ప్రభుత్వం సొంత ఖర్చుతో తెప్పిస్తోందని, గల్ఫ్ మృతుల విషయంలో వివక్ష చూపుతోందని సంబంధిత కుటుంబాల సభ్యులు వాపోతున్నారు. ప్రవాసీ విధానం, గల్ఫ్ బోర్డు ఏర్పడితే తమ సమస్యలు గట్టెక్కుతాయని ఆశిస్తున్నారు.

ఎన్నికల్లో ప్రభావం..

రాష్ట్రంలో అధిక సంఖ్యలో గల్ఫ్‌కు వలసలు ఉన్న పార్లమెంట్ నియోజకవర్గాల జాబితాలో నిజామాబాద్ ముందు వరుసలో ఉంటుంది. ఈ ప్రాంతం నుంచి ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన యువకులు ఎక్కువగా ఉంటా రు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గల్ఫ్ ఓటు బ్యాంకు ఉండడంతో ప్రధాన రాజకీయ పక్షాలు సంబంధిత ఓటర్లపై దృష్టి సారించాయి. గల్ఫ్‌లో పని చేస్తున్న వలస కార్మికులు ఒక్కొక్కరు స్వగ్రామంలో ఓటు హక్కు కలిగియున్న వారిలో కనీసం ఇరువురినైనా ప్రభావితం చేస్తారన్న అంచనా ఉంది.

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో సుమారు మూడు లక్షల వరకు గల్ఫ్ ఓటు బ్యాంకు ఉంటుందన్న అభిప్రాయాలున్నాయి. ఇందులో జగిత్యాల, కోరుట్ల, బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎక్కువగా గల్ఫ్ ఓట్లు ఉన్నాయి. నిజామాబాద్ పార్లమెంట్ నుంచి బీజేపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్, కాంగ్రెస్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్ పోటీ పడుతున్నారు. ఎన్నికల బరిలో ఉన్న ముగ్గురు అభ్యర్థులు గల్ఫ్ ఓటు బ్యాంకుపై దృష్టి సారించారు.

పసుపు బోర్డు హామీ పత్రంతో గట్టెక్కిన అర్వింద్...

గత పార్లమెంట్ ఎన్నికల్లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తానని రైతులకు హామీ పత్రం రాసిచ్చిన బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ విజయం సాధించారు. అప్పటి సిట్టింగ్ ఎంపీ కల్వకుంట్ల కవితను ఓటమి పాలు చేయడంలో పసుపు బోర్డు అంశాన్ని అర్వింద్ అనుకూలంగా మలుచుకున్నాడ న్న ప్రచారం జరిగింది. అదేమాదిరిగానే ప్రస్తుతం గల్ఫ్ బోర్డు అంశం తెర పైకి రావడంతో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తమకు అనుకూలం చేసు కోవడానికి ప్రయత్నిస్తున్నాయి.

ఇటీవల అసెంబ్లీ ఎన్నికల తదుపరి బీఆర్ ఎస్ ఎన్నికల విభాగం డీలా పడిందన్న అభిప్రాయాలున్నాయి. దీనికి తో డు గత ఎన్నికల్లో ప్రధాన భూమిక వహించిన తెలంగాణ జాగృతి వ్యవ స్థాపకురాలు కల్వకుంట్ల కవిత ప్రస్తుత ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండడం సైతం బీఆర్ఎస్‌పై ప్రభావం చూపనుందంటున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్, బీజేపీలు దూకుడుగా వ్యవహరిస్తూ గల్ఫ్ ఓట్లపై దృష్టి సారించాయి.

కాంగ్రెస్, బీజేపీల దూకుడు...

గల్ఫ్ ఓట్లను రాబట్టుకోవడానికి కాంగ్రెస్, బీజేపీలు దూకుడుగా వ్యవహరిస్తున్నాయి. ఇటీవల గల్ఫ్ సంఘాల నేతలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఎమ్మెల్సీ, నిజామాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డితో కలిసి పలువురు గల్ఫ్ సంఘాల నేతలు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తమ సమస్యలను తీసుకువెళ్లారు. సుమారు వారం రో జుల్లో మరోమారు గల్ఫ్ సంఘాల నేతలతో భేటీ కావడానికి సీఎం నిర్ణయించారు. ఈ భేటీకి గల్ఫ్ నుంచి పలువురు జేఏసీ సంఘాల నేతలను హైదరాబాద్‌కు రప్పించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈనెలాఖరున పలువురు కాంగ్రెస్ మంత్రులు గల్ఫ్‌లో పర్యటించడానికి ప్రణాళిక సి ద్ధమవుతున్నట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి. అదే విధంగా బీజేపీ సైతం ఈనెల 21వ తేదీన దుబాయిలో గల్ఫ్ ఓటర్లను ప్రభావితం చేసే నాయకులతో సమా వేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, బీజేపీ నాయకురాలు రాణి రుద్రమలతో పాటు పలువురు వెళ్లనున్నారు. గల్ఫ్ ఓట్లను రాబట్టుకోవడానికి కాంగ్రెస్, బీజేపీ లు గట్టి ప్రయత్నాలు చేస్తున్నాయి.

సంజయ్ కుమార్‌కు కేటీఆర్ పరామర్శ



పరామర్శిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 6 : జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిండెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు శనివారం పరామర్శించారు. సంజయ్ కుమార్ తండ్రి సీనియర్ న్యాయవాది హన్మంతరావు ఇటీవల మృతి చెందాడు. ఈ సందర్భంగా హన్మంతరావు చిత్రపటానికి కేటీఆర్ పూలమాల వేసి నివాళులు అర్పించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం సంజయ్‌కుమార్ తల్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. టెస్కాబ్ చైర్మన్ రవీందర్ రావు, జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్ ఉన్నారు.

నలందలో వీడ్కోలు వేడుకలు

జగిత్యాల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నలంద డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సర విద్యార్థు లకు జూనియర్ విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం కళాశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటా పాటలతో హంగామా చేశారు. పలు పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నిర్వాహకులు ప్రశంస పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సదుపాయాలు కల్పించాలి

డీఆర్‌డీవో సంపత్ రావు

రాయికల్, ఏప్రిల్ 6: ఎండాకాలం దృష్ట్యా ఉపాధి పని ప్రదేశంలో సదుపాయాలను కల్పించాలని జగిత్యాల డీఆర్‌డీవో సంపత్‌రావు అన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా శనివారం మండలంలోని కిష్టంపేట గ్రామంలో జరుగుతున్న నిరవధిక కందకాల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల వేతనాలు ఏప్రిల్ నెల నుంచి రూ.300లకు ప్రభుత్వం పెంచిందని, కూలీల సంఖ్యను పెంచేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఈ మూడు నెలల్లో కూలీలు 100 రోజుల పని పూర్తి చేసినట్లయితే రూ.30 వేల వేతనం పొందవచ్చునని అన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా కూలీలకు పని ప్రదేశంలో అన్ని సదుపాయాలు కల్పించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో దివ్య, టెక్నికల్ అసిస్టెంట్ విజయ్ కుమార్, రాము, వేణు, అమర్, కార్యదర్శి వేణుగోపాల్, మేట్ కందుల రమేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ప్రీ స్కూల్ డే వేడుకలు

రాయికల్, ఏప్రిల్ 6: రాయికల్ పట్టణంలోని 2, 3, 4, 7వ అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ప్రీ స్కూల్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పద్మావతి గర్భిణులు, బాలింతలకు 0-6 సంవత్సరాల పిల్లలకు, తల్లులకు ప్రీ సూల్ కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు. అసెస్‌మెంట్ కార్డులు, అభివృద్ధి సృజనాత్మక కథల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సువర్ణ, ఉమారాణి, వనిత, రజిత, ఆయాలు రాధిక, భూమమ్మ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 6 : జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్ గ్రామంలో పశువర్ధకశాఖ ఆధ్వర్యంలో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. దీనిలో భాగంగా గ్రామంలో 324 గేదెలకు, 36 ఆవులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈకార్యక్రమంలో వెటర్నరీలైవ్‌స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూరణ చందర్, గ్రామపంచాయతీ సెక్రటరీ శంకర్, కారోబార్ గంగారాం, ఆఫీస్‌సబార్డినేట్స్ రాజు, అనిత, గంగయ్య, వెంకటమ్మ, రిటైర్డ్ వీఎల్‌వో సయ్యద్ సాబిత్ అలీ, పాడిరైతులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ కార్యాలయ అధికారికి పీఆర్‌టీయూ ఉపాధ్యాయుల వినతి

జగిత్యాల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్నికల విభాగం తహసీల్దార్ హకీంకు పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు విన తిపత్రం సమర్పించారు. శనివారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో తహసీల్దార్ హకీంను కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా పలువురు పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు మాట్లాడారు. దీర్ఘ కాలిక వ్యాధులు బీపీ, మధుమేహం వంటి వాటితో బాధపడే వారికి, దివ్యాంగులకు, గర్భిణులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపివ్వాలని కో రారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఎన్నికల సామగ్రిని తీసుకున్న సిబ్బందిని పోలింగ్ కేంద్రానికి సాయంత్రం వరకు తరలించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల సామగ్రిని, సిబ్బందిని తరలించ డానికి ఆర్‌టీసీ బస్సులు వినియోగించడానికి ఆదేశాలు ఇవ్వాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో తగినంత ఫర్నిచర్ ఏర్పాటుకు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఎన్నికల విధులను నిర్వహించే రెండు రోజులలో భోజన, మంచినీరు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గాదె నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి నారుకుల్ల శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షుడు గుంటుక సురేశ్, నాయకులు మోత్కూరి సత్యనారాయణ, మీడియా కన్వీనర్ రాజు జాదవ్ పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

ఇంటి నుంచి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్

జగిత్యాల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి ఓటు హక్కును వయో వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జిల్లా కార్యాలయం కౌన్సిలింగ్ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి కృషి చేస్తున్న హరి అశోక్ కుమార్‌ను పలువురు వృద్ధులు పూలమాలలు, శాలువాల తో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులైన వృద్ధులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు బోగ శశిధర్, ప్రధాన కార్యదర్శి నాగేందర్ రెడ్డి, ఆర్డీవో కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ తఫజుల్ హుస్సేన్, సీనియర్ సిటిజెన్స్ గౌరవ సలహాదారు దేశాయి, గౌరిశెట్టి విశ్వనాథం, హన్మంత్‌రెడ్డి, శివానందం, యాకూబ్, సత్యనారాయణ, కళాశ్రీ సంస్థ అధ్యక్షుడు గుండేటి రాజు, అల్లూరి బాపురెడ్డి, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా బీజేపీ ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు



మెట్‌పల్లిలో జెండా ఆవిష్కరించిన పట్టణాధ్యక్షుడు బోడ్ల రమేష్

ధర్మపురి, ఏప్రిల్ 6: ధర్మపురి మండలంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని జైనా తదితర గ్రామాల్లో, ధర్మపురి పట్టణంలోని నందిచౌక్ వద్ద బీజేపీ మండల అధ్యక్షులు సంగెపు గంగారాం, పట్టణ అధ్యక్షులు బెజ్జారపు లవణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేర్వేరుగా పార్టీ జెండాను ఆవిష్కరణ చేశారు. బీజేపీ అసెంబ్లీ కో-కన్వీనర్ లక్ష్మణ్, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, తిరుమన్ దాసు సత్యనారాయణ, రామదాసు, కిషన్, లింగారెడ్డి, శంకర్, మూర్తి, సురేందర్, మల్లేష్ పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని భూపతిపూర్ గ్రామంలో శనివారం బీజేపీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరణ చేసి స్వీట్లు పంచిపెట్టారు. బీజేపీ మండల అధ్యక్షుడు అన్నవేణి వేణు, ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, రాము, శేఖర్, రమేష్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ధర్మపురి, శ్రీకాంత్, శ్రీకాంత్, సంజీవ్, మల్లారెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలో శనివారం బీజేపీ ఆవిర్భావ వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పతాకావిష్కరణ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు బుచ్చిరాములు, రాజాశం, శ్రీనివాసరెడ్డి, నర్సింహారెడ్డి, అంజయ్య, నరేష్ పాల్గొన్నారు.

మల్యాల: మల్యాల మండలంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల బీజేపీ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. కరబూజ చక్రంగౌడ్, మల్లేశం, లత, ఆనందం, సంకీర్త్ పాల్గొన్నారు.

బీర్‌పూర్: మండలంలోని తుంగూర్, కమ్మునూర్ గ్రామాల్లో శనివారం భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఆడెపు నర్సయ్య జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

మల్లాపూర్: బీజేపీ మండలాధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్ర లక్ష్మి, బైన ప్రశాంత్, గజ్జి శ్రీను, దేశెట్టి భూమేష్, లవంగా శివ పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేది ఏకైక పార్టీ బీజేపీతోనే సాధ్యమవుతుందని పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజ్‌పాల్‌రెడ్డి అన్నారు. శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని విట్టంపేట గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. నా యకులు రాజ గంగారాం, రాజేందర్, భార్గవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని సిరికొండలో శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ క్రమశిక్షణ గల పార్టీ అని అద్వానీ, వాజ్‌పేయ్ లాంటి మహామహులు పని చేసి ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వాలు కలిగిన పార్టీగా అవతరించిందన్నారు. గాంధారి శ్రీనివాస్, కాశోజీ ప్రతాప్ ఉన్నారు.

కోరుట్ల: పట్టణంలోని వేంకటేశ్వర దేవాలయం వద్ద శనివారం బీజేపీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ జెండాను ఆవిష్కరించారు. కేంద్రంలో ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను వివరించి వేడుకలను నిర్వహించారు. కౌన్సిలర్ పెండం గణేష్, నరేష్, నాయకులు ధనంజయ్, కస్తూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్ : మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం బీజేపీ ఆవిర్భావ వేడుకలను మండల అధ్యక్షుడు, చిన్నమెట్‌పల్లి ఎంపీటీసీ సభ్యుడు పంచరి విజయ్ కుమార్, యూసుఫనగర్ మాజీ సర్పంచ్ గుగ్గిళ్ల తుక్కారాం గౌడ్‌ల ఆధ్వర్యంలో బీజేపీ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజెంద్రప్రసాద్, లింగారెడ్డి, బద్దం తిరుపతి రెడ్డి, గంగనర్సయ్య, శరత్, శిటిస్, భూమనందం, చక్రపాణి, గంగాధర్, లక్ష్మణ్, వెంకటేష్, శేఖర్ రాజు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: దేశంలో అత్యంత ప్రజాదరణ కలిగిన పార్టీ బీజేపీ అని పార్టీ పట్టణాధ్యక్షుడు బోడ్ల రమేష్ అన్నారు. శనివారం భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో నాయకులు చెట్లపెల్లి సుఖేందర్‌గౌడ్, ధోనికెల నవీన్, చెట్లపెల్లి మీనా, వడ్డేపల్లి శ్రీనివాస్, గంగాధర్, శ్రీనివాస్ బోడ్ల నరేష్, కుడుకల రఘు, లావణ్య, సౌజన్య, వరలక్ష్మి, సునీత పాల్గొన్నారు.



భూపతిపూర్‌లో బీజేపీ జెండావిష్కరణ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

పేకాటరాయుళ్ల పట్టివేత

కథలాపూర్, ఏప్రిల్ 6: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. శివారులోని ఓ కొట్టంలో పేకాట ఆడుతున్నట్లు ఎస్సై నవీన్‌కు సమాచారం రావడంతో సిబ్బందితో అక్కడికి వెళ్లి పట్టుకున్నారు. ఐదుగురి నుంచి రు. 7,200లు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

రాయికల్, ఏప్రిల్ 6: మండలంలోని మైతాపూర్ గ్రామానికి చెందిన నాగుల సతీష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. ఈ నెల 2వ తేదీన నాగుల సతీష్‌కు చెందిన గొర్రెలు పుట్ట గంగాధర్‌కు చెందిన వరి పొలంలో మేశాయి. ఈ విషయంలో 3వ తేదీన పెద్ద మనుషుల సమక్షంలో పిలిపించి మాట్లాడుతుండగా సతీష్ కులం పేరుతో దూషించి చెప్పుతో కొట్టి అవమానించాడని గంగాధర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సైబరాబాద్‌లో బాలిక కిడ్నాప్

- జగిత్యాలలో సంచారం, నలుగురిపై కేసు నమోదు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 6 :హైదారాబాద్ పట్టణంలోని సైబరాబాద్‌కు చెందిన ఓ బాలిక కిడ్నాప్‌నకు గురైనట్లు తెలిసింది. అయితే కిడ్నాప్‌నకు గురైన బాలిక కొన్ని రోజులుగా జగిత్యాల జిల్లా కేంద్రంలో సంచరిస్తున్నట్లు జగిత్యాల పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు జగిత్యాలతో పాటు మెట్‌పల్లి ప్రాంతాలకు చెందిన నలుగురు యువకులు బాలికను కిడ్నాప్ చేసినట్లు గుర్తించి వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి హార్వెస్టర్ దగ్ధం



భూషణరావుపేటలో దగ్ధమైన హార్వెస్టర్

కథలాపూర్, ఏప్రిల్ 6 : మండలంలోని భూషణరావుపేటలో శనివారం ఉదయం విద్యుత్ తీగలు తగిలి రాగుల రవి అనే యజమాని హార్వెస్టర్ పూర్తిగా దగ్ధమైంది. గన్రెడ్డి కుంట శివారులో ఓ రైతుకు చెందిన వరి పొలం కోస్తుండగా పైభాగంలో ఉన్న ఎల్‌టీ విద్యుత్ తీగలు తగిలాయి. వైర్ల నుంచి నిప్పురవ్వలు ఇంజిన్‌పై పడడంతో మంటలు చెలరేగాయి. వరి పొలంలోనే మంటలు వ్యాపించడంతో భయాందోళనకు గురైన రైతులు ఫైర్ ఇంజిన్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక దళ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. వ్యవసాయానికి సంబంధించిన వైర్లను చూసు కుని హార్వెస్టర్ యజమానులు వరి కోతల పనులు చేపట్టాలని విద్యుత్ అధికారులు సూచించారు. ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడానికి అవకాశం ఉంటుం దన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై నవీన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ సర్పంచ్ గడ్డం స్వామిరెడ్డి, ఎంపీటీసీ ఆంజనేయులు పరిశీలించారు.

హైటెన్షన్ విద్యుత్ వైర్లు తాకి యువకుడి మృతి

సుల్తానాబాద్, ఏప్రిల్ 6: సుల్తానాబాద్ మండలంలోని మియాపూర్‌లో శనివారం ఓ వ్యాన్ రివర్స్ వస్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలు వ్యాన్‌కు తగిలి దానిని అనుకుని ఉన్న దొడ్ల గంగాదర్ అనే యువకుడు మృతి చెందాడు. మియాపూర్ గ్రామానికి చెందిన ఒక రైతు తన పొలంలో షెడ్డు నిర్మించుకుంటున్న సందర్భంలో దానికి అవసరమైన సిమెంట్ బ్రిక్స్‌ను గోదావరిఖని నుంచి వ్యాన్‌లో తెచ్చారు. వ్యాన్ పొలంలో దిగబడి పోవ దంతో వేరే ట్రాక్టర్ తెచ్చి ఇటుకలను ఇదే గ్రామానికి చెందిన హమాలీ పని చేసే దొడ్ల గంగాదర్(27) పనిస్థలానికి తరలించారు. తిరిగి వ్యాన్ రివర్స్ వెళుతుండగా గంగాధార్ దాన్ని తాకుతూ నిలుచున్నాడు. పైన ఉన్న 11 కేవీ హైటెన్షన్ వైర్లు వ్యాన్‌పై భాగంలో తాకి షాక్ రావడంతో గంగాదర్ అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

- ఈసీఈ హెచ్‌వోడీ ప్రభాకర్



మాట్లాడుతున్న హెచ్‌వోడీ ప్రభాకర్

కొడిమ్యాల, ఏప్రిల్ 6: ఇంజనీరింగ్ విద్యార్థులు విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవాలని ఈసీఈ హెచ్‌వోడీ ప్రభాకర్ కోరారు. శనివారం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూలో ఈ నెల 1న ప్రారంభమైన డీజిటల్ డీజైన్ అండ్ వెరీ లాగ్ ముగిసింది. ముగింపు సమావేశంలో ఈసీఈ హెచ్‌వోడీ మాట్లాడుతూ వర్క్ షాప్‌లో విద్యార్థులు వివిధ విభాగాల్లో డీజైన్ ఎనాలసీస్ వెరిఫికేషన్, వీఎల్‌ఎస్ఐ అండ్ వెరీ లాగ్‌లో కోడింగ్ స్కిల్స్ ఏవిధంగా తర్ఫీదు అవ్వాలో నేర్పించామన్నారు. ప్రతి విద్యార్థి సమయాన్ని వృధా చేయకుండ కష్టపడి చదువుకొని లక్ష్య సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ వర్క్ షాప్‌నకు రిసోర్స్ పర్సన్‌గా వచ్చిన డా.. సనత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో జ్ఞానాన్ని సంపాదించుకుంటూ అకుంఠిత దీక్షతో ముందుకు సాగాలన్నారు. బారత దేశ భవిష్యత్తు యువత మీద ఆధారపడి ఉందన్నారు. ఈ ముగింపు సమావేశంలో కో కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, కోఆర్డీనేటర్ శ్రీనివాస్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌ను బెదిరించిన ఇద్దరిపై కేసు

కోల్‌సిటీ, ఏప్రిల్ 6: విలేకరులమని తమకు రూ.10వేలు ఇవ్వాలంటూ రేషన్ డీలర్‌ను బెది రించిన ఇద్దరు వ్యక్తులపై శనివారం కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. తిలక్‌నగర్, ఫైవింక్లయిన్‌లో రేషన్ షాపు నిర్వహించే అవినాష్‌ను సురేష్, శివ అనే ఇద్దరు తాము విలేకరులమని, రూ.10వేలు ఇవ్వాలంటూ బెదిరించినట్టు పోలీసులు తెలిపారు. బాధితుడిఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ఎండిన పంటలకు నష్ట పరిహారం అందజేయాలి



ఎండిపోయిన పంటను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

గంగాధర, ఏప్రిల్ 6: ప్రభుత్వం ఎండిన పంటలకు నష్ట పరిహారం అందజేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బీజేపీ ఆధ్వర్యంలో మధురానగర్‌లో ఎండిపోయిన వరి పంటను పరిశీలించారు. ఈసందర్భంగా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యేమేడిపల్లి సత్యం ఎక్కడ పొలాలు ఎండిపోలేదని చెప్పడం సరి కాదన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో అశోక్, రేండ్ల శ్రీనివాస్, నారాయ ణ ,రాజశేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఏప్రిల్ 6: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన ఎల్‌ఎల్‌బీ ఎల్‌ఎల్ఎం మూడో సెమిస్టర్ ఫలితాలను శనివారం విడుదల చేసినట్లు విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీశ్రీరంగప్రసాద్ తెలిపారు. పరీక్షల ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

మృత్యు శకటం

- విద్యార్థులను బలితీసుకున్న అతివేగం
- బోల్తా పడిన మొరం టిప్పర్
- మట్టిలో కూరుకుపోయి ముగ్గురు దుర్మరణం
- అన్నాచెల్లెళ్లు, సమీప బంధువు మృతి
- బోర్నపల్లిలో విషాదం




విజయ్, వర్ష, సింధుజా మృతదేహాలు

హుజూరాబాద్, ఏప్రిల్ 6: పెద్దమ్మతల్లికి మొక్కులు చెల్లించుకొని తిరుగు ప్రయాణం అవు తున్న వారిని విధి వెంటాడింది. మొరం టిప్పర్ రూపంలో ముగ్గురు చదువుకునే విద్యార్థులను మృత్యువు కబళించింది. మోటర్ సైకిల్‌పై ముగ్గురు ఇంటికి వస్తున్న క్రమంలో మొరం టిప్పర్ బోల్తా పడడంతో అదే మట్టిలోనే కురుకుపోయి అక్కడికక్కడే మృతి చెందారు. ఒకే కుటుంబానికి చెందిన అన్నాచెల్లెళ్లు, సమీప బంధువు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఈ హృదయ విదారక సంఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే హుజూరాబాద్ మున్సి పాలిటీ పరిధిలోని బోర్నపల్లిలో పెద్దమ్మతల్లి బోనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గంట విజయ్ (17), గంట వర్ష (15), గంట సింధుజా (18) హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. నిద్ర వస్తుందని తల్లిదండ్రులకు తెలిపారు. ముగ్గురు కలిసి మోటర్ సైకిల్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో ఎలబోతారం నుంచి ఎదురుగా వస్తున్న మట్టి టిప్పర్ గమనించారు. మూల మలుపు ఉండడంతో విజయ్ మోటర్ సైకిల్‌ను నిలిపివేశాడు. అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన టిప్పర్ డ్రైవర్ వారిని ఆకస్మాత్తుగా గుర్తించి సడన్ బ్రేక్ వేయడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో బైక్‌పై ఉన్న ఉన్న ముగ్గురు మట్టిలో కురుకుపోయి శ్వాస అందకపోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. గమనించిన స్థానికులు ఎక్స్‌కావేటర్ సహాయంతో మృతదేహాలను వెలికి తీసి హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన అన్నాచెల్లెళ్లు విజయ్, వర్ష, బంధువు సింధుజా మృతి చెందడంతో కుటుంబ సభ్యులతో పాటు, స్థాని కులు కంట తడి పెట్టారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుము క న్నాయి. గంట విజయ్ ఇంటర్, వర్ష పదో తరగతి, సింధుజా డిగ్రీ చదు వుతున్నారు. హుజూరాబాద్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

● అతివేగంతో ఇబ్బందులు..

నేషనల్ హైవే పనులు జరుగుతుండడంతో టిప్పర్ డ్రైవర్లు అతివేగంగా వాహనాలు నడుపుతున్నారు. దీంతో ఆ రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 500 టిప్పర్లతో



బోల్తా పడిన టిప్పర్

సైదాపూర్, హుజూరాబాద్ మండలాల్లోని గుట్టల్లో నుంచి మట్టిని తరలిస్తున్నారు. అనుభవం లేని యువ డ్రైవర్లతో టిప్పర్లు నడుపుతుం డడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో కూడా టిప్పర్ డ్రైవర్లు కార్లు, మోటర్ సైకిళ్లను ఢీ కొట్టిన సందర్భాలు ఉన్నాయి. బోర్నపల్లిలో జరిగిన సంఘటనతో పోలీసులు కళ్లు తెరిచి డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

● మృతుల కుటుంబాలకు పరామర్శ..

బోర్నపల్లిలో ముగ్గురు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి చేరుకొని మృతుల కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ మృతుల కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి సంతాపం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అక్రమ వడ్డీ, ఫైనాన్స్ వ్యాపారుల ఇళ్లపై పోలీసుల దాడులు

- రూ.16.13లక్షల నగదు, 359డాక్యుమెంట్లు స్వాధీనం

- జిల్లా వ్యాప్తంగా 14కేసులు నమోదు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 6: జిల్లావ్యాప్తంగా అనుమతులు లేకుండా అక్రమ వడ్డీ, ఫైనాన్స్‌లు నిర్వహిస్తున్న వ్యాపారుల ఇళ్లపై శనివారం 24పోలీసు బృందాలు ఏకకాలంలో దాడులు చేశారు. జిల్లాలోని 13పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో దాడులుచేసి రూ. 16.13లక్షల నగదు, 359డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీనం చేసుకొని 14కేసులు నమోదుచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ అనుమతితో చట్టపరమైన నిబంధనలకు లోబడి ఫైనాన్స్ నిర్వహించాలని చెప్పారు. ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని వడ్డీలకు డబ్బులు ఇచ్చి వారి నుంచి అధిక వడ్డీ వసూలు చేసే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తమకున్న అత్యవసర పరిస్థితి, తాత్కాలిక అవసరాల కోసం అధిక మొత్తంలో అవసరంకు మించి అధిక వడ్డీలకు అప్పుచేసి ఆ అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడి తమ కుటుంబాలకు ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. ప్రభుత్వ అనుమతితో చట్టపరమైన పద్ధతులలో ఫైనాన్స్ నిర్వహించే వారిని మాత్రమే విశ్వసించాలని చెప్పారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకపోయినా అక్రమ ఫైనాన్స్ వ్యాపారం నడిపే వారి వివరాలు జిల్లా పోలీసు కార్యాలయంలో తనకు సమాచారం ఇవ్వాలన్నారు. డయల్ 100కు ఫిర్యాదుచేసినా చర్యలు ఉంటాయని చెప్పారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా పోలీసుశాఖ పనిచేస్తుందన్నారు. అప్పు తీసుకోవడం , ఇవ్వడం నేరం కాదని, ఆర్‌బిఐ నిబంధనలు , మనిలెండింగ్ యాక్ట్ నిబంధనల ప్రకారం చట్టబ ద్ధంగా ఎవరైనా లైసెన్స్‌తో అప్పులు ఇవ్వొచ్చన్నారు. చట్ట విరుద్ధంగా అధిక వడ్డీ రేట్లతో సామాన్యులై దౌర్జన్యం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట: జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, బొప్పాపూర్, తదితర గ్రామాల్లోని వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. సుమారు పది మంది వ్యాపారుల ఇళ్లలో తనిఖీలు జరిపారు. నగదు, ప్రామిసరీ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

వేములవాడ: వేములవాడ పట్టణంలోని వడ్డీ వ్యాపారులపై జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. అధిక వడ్డీకి నగదు ఇస్తూ ఇబ్బందుల గురి చేస్తున్నారన్న సమాచారం మేరకు స్థానిక డీఎస్పీ కే నాగేంద్ర చారితో కలిసి చేపట్టిన ఈ దాడులలో భాగంగా పట్టణంలో పలువురు వడ్డీ వ్యాపారులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ ప్రవీణ్, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు అంజయ్య, నాయుడు, పృధ్విగౌడ్, జ్యోతి తదితరులు తనిఖీలలో పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న ఒకరిపై కేసు

శంకరపట్నం, ఏప్రిల్ 6: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదైనట్లు శనివారం పోలీసులు తెలిపారు. మండలంలోని గద్దపాక గ్రామానికి చెందిన చిత్తారి కిరణ్ అక్రమంగా మద్యం అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి చెప్పారు. కిరణ్ వద్ద నుంచి 4.355లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మినట్లు సమాచారం వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని కోరారు.

మిస్సింగ్ కేసు నమోదు

వీణవంక, ఏప్రిల్ 6: మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన అంబాల సమ్మయ్య రెండు రోజుల క్రితం ఇంటిలో కుటుంబ సభ్యులతో గొడవ పడి వెళ్లి పోయాడని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేశామని ఎస్సై తిరుపతి తెలిపారు. బంధువుల ఇళ్లల్లో గ్రామంలో వెతికినా ఆచూకీ లభించక పోవడంతో భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వివాహిత అదృశ్యం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 6: భర్తతో గొడవపడిన వివాహిత అదృశ్యమైనట్లు ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన మనిషా(25) ఈనెల 3న తన భర్తతో గొడవ పడి రాత్రి 9:30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి అదే గ్రామంలోని బంధువుల ఇంటిలో ఆశ్ర యం పొందింది. 4న మధ్యాహ్నం 12 గంటల సమయంలో తన అత్త ఇంటికి వెళ్తున్నట్లు చెప్పిన మనీషా బయటకు వెళ్లి ఇంతవరకు ఆచూకీ లేకుండా పోయిందని ఆమె తండ్రి దాసరి నరేష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మనీషాకు ఇద్దరు కొడుకులు ఉన్నారని, తండ్రి ఫిర్యాదు మేరకు అదృశ్యం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 6: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురు వాహనదారులకు జైలుశిక్ష పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన తనిఖీలలో పట్టుబడిన 21 మంది వాహనదారులను శనివారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా ఇందులో నుంచి ఒకరికి ఏడు రోజులు, ఇద్దరికి ఐదు రోజుల జైలుశిక్ష, మొత్తం 6,500 రూపాయల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించినట్లు సీఐ తెలిపారు. మిగతా 18 మంది వాహనదారులకు 31 వేల రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు.

వాగులో మునిగి కార్మికుడి మృతి

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 6: మండలంలోని చౌలమద్ది గ్రామంలోని బ్రిడ్జి నిర్మాణ పనుల కోసం వచ్చిన షిడం పోశం(40) అను కార్మికుడు ప్రమాదవశాత్తు వాగులో మునిగి శనివారం మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మంచిర్యాల జిల్లా భీమారం మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన పోశం కూలి పనులు చేసుకంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. భార్య ఎనిమిదేళ్ల క్రితం చనిపోవడంతో నలుగురు సంతానంతో కలిసి ఉంటున్నాడు. పనులు కోసం చౌలమద్ది గ్రామంలోని వాగుపై బ్రిడ్జి నిర్మాణంలో పని కోసం తోటి కూలీలతో కలిసి వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం వాగులో తోటి కూలీలతో కలిసి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. తోటి కూలీలు చీకటి పడేంత వరకు వెతికినా ఫలితం లభించలేదు. శనివారం ఉదయం పోశం మృతదేహాన్ని గుర్తించారు. పోశం కుమారుడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్6: హైదరాబాద్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణ సంస్థలో మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు తల్లిదండ్రులను కోల్పో యిన అనాథ బాలికలు, తల్లి లేదా తండ్రి కోల్పోయిన బాలికలు, ఇతర నిరాశ్రయులైన పిల్లలు, చిల్డ్రెన్ హోం సంస్థల్లోని బాలికలు, అక్రమ రవాణాకు గురైన బాధిత బాలికలు, వికలాంగుల బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లలో 60 చొప్పున సీట్లు ఉన్నాయని, మొత్తం 240 సీట్లకు దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్‌లో గల బాల రక్షాభవన్ కార్యాలయంలో దరఖాస్తు ఫారాల కోసం సంప్రదించాలని సూచించారు. పూరించిన దరఖా స్తులను మే15 సాయంత్రం 5 గంటలలోపు ధ్రువపత్రాలను జతచేసి సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఫోన్ 833-298-7862 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చిన్నారిని చిదిమేసిన ఆటో

- రోడ్డు ప్రమాదంలో 18 నెలల బాలుడి మృతి



సుధన్య(ఫైల్)

కోరుట్ల, ఏప్రిల్ 6: అప్పటి వరకు కుటుంబ సభ్యుల ముందు తప్పటడుగులు వేస్తూ.. వచ్చీ రాని మాటలతో అందరినీ ఆనందంలో ముంచెత్తిన ఆ చిన్నారి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడటంతో కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. పోలీసులు స్థానికులు ఇచ్చిన సమచారం మేరకు.. పట్టణంలోని అంబేద్కర్ నగర్ ప్రాతంలో నివాసం ఉంటున్న పొట్ట రిషింద్ర - అపూర్వ దంపతులకు కుమారుడు సుధన్య (18 నెలలు) ఉన్నాడు. శనివారం ఉదయం సుధన్య ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. అదే సమయంలో ఆ ప్రాంతంలో మంచి నీళ్ల సరఫరా చేయడానికి వచ్చిన ఆటో ప్రమాదవశాత్తూ చిన్నారిని ఢీ కొట్టడంతో సుధన్య ఆటో చక్రాల కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగానే మృతి చెందాడు. చిన్నారి తండ్రి రిషింద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

ద్విచక్రవాహనం చెట్టుకు ఢీకొని ఒకరి మృతి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 6: ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని పెగడపల్లి శివారులో చోటుచేసుకుంది. శనివారం మండలంలోని పందిళ్ళ గ్రామానికి చెందిన సూర తిరుపతి(45) తన భార్య స్వరూపతో కలిసి తన ద్విచక్ర వాహనంపై సుల్తానాబాద్ నుండి పందిళ్లకు వస్తుండగా మార్గమధ్యలో పెగడపల్లి శివారులో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీకొంది. దీంతో సూర తిరుపతికి తలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, తిరుపతి భార్య స్వరూపకు స్వల్ప గాయాలయ్యాయి. తిరుపతికి భార్యతో పాటు కుమారుడు కూతురు ఉన్నారు. ఈ విషయంపై మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై ఓంకార్ యాదవ్ కేసు నమోదు చేసుకొని తిరుపతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపెల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్



విద్యార్థుల పత్రాలను తనిఖీ చేస్తున్న అధికారులు

తిమ్మాపూర్, ఏప్రిల్ 6: రెండో విడత జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ జేఈఈ మెయిన్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం మూడో రోజు జిల్లా వ్యాప్తంగా కేవలం మండల కేంద్రలోని ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రాంలోనే రెండు షిఫ్టులలో పరీక్షలు నిర్వహిచారు. మొదటి షిఫ్టులో 680 మందికి 608 మంది, రెండో షిఫ్టులో 672 మందికి 61 4 మంది పరీక్షకు హాజరయ్యారు. అభ్యర్థులను రెండు గంటల ముందు నుంచే పరీక్ష కేంద్రం లోనికి అనుమతించారు. ఎండ తీవ్రత కారణంగా విద్యార్థులకు ఇబ్బందులు తలెత్త కుండా తగిన ఏర్పాట్లు చేశామని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ లలితకుమారి తెలిపారు.

నేతన్నలు ధైర్యం వీడొద్దు

- రాజకీయపార్టీల వల్లే వస్త్ర పరిశ్రమ సంక్షోభం
- గత ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు
- కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవాలి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 6: సిరిసిల్ల మళ్లీ ఉరిశాలగా మారుపోతుందా అనే అను మానాలు వ్యక్తం అవుతున్నాయని, నేతన్నలు ధైర్యం వీడొద్దని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ వీరయ్య అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో శనివారం రాత్రి వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్యవేదిక జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి మూడు రాజకీయ పార్టీలు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లేనన్నారు. కేంద్రం ప్రభుత్వం చేనేత, టెక్స్‌టైల్ శాఖలను రద్దు చేసి వస్త్ర పరిశ్రమలతోపాటు అనుబంధం రంగాల పరిశ్రమలపై 4 శాతం ఉన్న జీఎస్టీని 12 శాతానికి పెంచి భారం మోపిందని చెప్పారు. అంతే కాకుండా బహుళ జాతి కంపెనీలను ప్రోత్సహిస్తోందన్నారు. దీంతో చిన్నచిన్న పరిశ్రమల్లో సంక్షోభం రావడంతో నేతన్నలకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. సిరిసిల్లలో మూడు నెలలనుంచి వస్త్ర పరిశ్రమలు బంద్ కావడంతో నేతన్నలకు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నెల రోజుల్లో ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరు కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకారమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరలతోపాటు ఇతర వస్త్రాలకు సంబంధించిన బకాయిలతోపాటు యారన్ సబ్సిడీలను చెల్లించి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కోపంతో సిరిసిల్లలో నేతన్నలకు ఉపాధిని కల్పించకుండా కక్షసాధింపులకు పాల్పడుతోందన్నారు. మూడు నెలలనుంచి ఉపాధిని కల్పించేందుకు బతుకమ్మ చీరలతోపాటు ఇతర ప్రభుత్వ ఆర్డర్‌లను ఇప్పించాలంటూ నేతన్నలు పోరాటాలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని చెప్పారు. ఈ సమస్యకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం బాధ్యత వహించి ప్రభుత్వంతో పోరాటం చేసి నేతన్నలకు ఉపాధిని కల్పించాలన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలకు సంక్షోభంతో పాటు లక్షల్లో కరెంట్ బిల్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటని గతంలోనే



హాజరైన నేతన్నలు

పరిష్కారించాల్సి ఉండాల్సిందని చెప్పారు. అ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కరెంట్ బిల్లులు సైతం భారంగా మారిపోయా యన్నారు. సిరిసిల్లలో మరమగ్గాల కార్మికులను ఓనర్‌లు చేయాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం తీసుకోచ్చిన వర్కర్ టూ ఓనర్ పథకం నిర్మాణాల దశలలోనే నిలిచిపోయిందని తెలిపారు. దీంతో ఇప్పటికి కార్మికులు ఓనర్‌లు కాలేకపోయారని అన్నారు. మూడు నెలలనుంచి ఉపాధిని కోల్పొయిన నేతన్నలు భిక్షటనలు చేసుకోని భోజనం చేయాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. నేతన్నలు సమస్యలను పరిష్కారించు కునేందుకు నిత్యం పోరాటాలను కొనసాగించాలని సూచించారు. ఇప్పటికైనా సిరిసిల్లలో నేతన్నల అకలి చావులను చూసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి ఉపాధిని కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూరపాటి రమేశ్, జేఏసీ నేతులు మండల సత్యం, మంచె శ్రీనివాస్, మూషం రమేష్, కోడం రమణ, సిరిసిల్ల రవీందర్, మండల రాజు, పంతం రవి, వెల్దండి దేవదాస్, కట్టికోల లక్ష్మీనారాయణ, తాటిపాముల దామోదర్, మోర రాజు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు విప్ పరామర్శ

ధర్మపురి, ఏప్రిల్ 6: ధర్మపురి పట్టణంలో మృతి చెందిన పలువురు కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా పట్టణంలో అనారోగ్యంతో మృతి చెందిన దూడ వెంకట్ మృతదేహాన్ని ఆయన సందర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి, రూ. 5 వేలు ఆర్థికసాయం అందించారు. అలాగే కాశెట్టివాడలో పాదం పెద్దన్న, ఆకుల చిన్నగంగన్న కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, మండల ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, చీపిరిశెట్టి రాజేష్, మాదాసు మల్లేష్, ఆశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎండపల్లి : మండలంలోని మారేడుపల్లి. గుళ్లకోట గ్రామాలలో ఇటీవలే అనారోగ్య కారణాల వల్ల మృతి చెందిన మాజీ సర్పంచ్ బొల్లం లచ్చయ్య, ప్రభుత్వ ఉపాధ్యాయుడు లింగంపల్లి చందు కుటుంబాలని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తాటిపర్తి శైలెందర్‌రెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షడు మల్లేశంగౌడ్, లింగారెడ్డి పాల్గొన్నారు.

'ఉపాధి' పనులను సద్వినియోగం చేసుకోవాలి

అడిషనల్ డీఆర్‌డీవో మదన్‌మోహన్

కొడిమ్యాల, ఏప్రిల్ 6 : ఉపాధిహామీ పనులకు వచ్చె కూలీలు ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ డీఆర్‌డీవో మదన్‌మోహన్ కోరారు. శనివారం మండలంలోని తిప్పయ్యపల్లి, నమిళికొండ నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడుతూ దినసరి కూలీ రూ.272 నుంచి రూ. 300 వరకు పెరిగిందన్నారు. గ్రామాలలో చేపట్టే ఉపాధిహామీ పనులకు ఎక్కువ మంది కూలీలు రావాలని మెజర్మెంట్ ప్రకారం పనులు చేసి ప్రభుత్వం అందిస్తున్న దినసరి కూలీలను తీసుకోవాలని అవగాహన కల్పించారు. కూలీలు వంద రోజులు పనికి రావాలని అన్నారు. అడిషనల్ డీఆర్‌డీవో వెంట ఏపీవో సతీష్, టెక్నీకల్ అసిస్టెంట్లు భువన్, శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్లు సాగరిక, శేఖర్ కూలీలు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల, ఏప్రిల్ 6: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. శనివారం పట్టణంలోని భీముని దుబ్బ ప్రాంత్రానికి చెందిన ముదిరాజు సంఘం అధ్యక్షుడు రేంజర్ల నర్సయ్య, మాజీ కౌన్సిలర్, మున్సిపల్ కో - అప్షన్ సభ్యురాలు రెంజెర్ల కళ్యాణిలు బీఆర్ఎస్‌కు రాజీనామా కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావులు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆడెపు కమల - మధు ఎంబేరి నాగభూషణం, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్‌రావు, కొంతం రాజం, తుపాకుల బాజన్న, మ్యాకల నర్సయ్య, దండవేని వెంకట్, చెట్టుపల్లి రంజిత్ కుమార్, రమేష్, తోడేటి శంకర్, తోడేటి శంకర్, చిలువేరి విజయ్ పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

మెట్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. శనివారం మల్లాపూర్, మెట్‌పల్లి మండలాలకు చెందిన పలువురు పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండవాను జువ్వాడి నర్సింగరావు కప్పి ఆహ్వానించారు. నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి అయిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని అత్యధిక మోజార్టితో గెలిపించుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలు పునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేం దర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, యూత్ అధ్యక్షుడు జెట్టి లక్ష్మ ణ్, జలపతిరెడ్డి, గంగాధర్, మహేష్‌రెడ్డి, రఘు, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఎంఈఓకు ఏబీవీపీ నాయకుల వినతి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 6 : ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలను తీసుకోవాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం మండల విద్యాధికారికి వినతి పత్రం అందించారు. పట్టణంలోని మానవ వనరుల కార్యాలయం వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన, ఆందోళన చేశారు. వేసవి సెలవుల్లో భాగంగా ఒంటి పూట బడి నడపకుండా కొన్ని పాఠశాలలు ఉదయం 8 నుంచి మధ్యాహ్నాం 12:30 వరకు, సాయత్రం 3 నుంచి 5 గంటల వరకు పాఠశాలను నిర్వహిస్తున్నారన్నారు. మరికొన్ని పాఠశాలలు ఉపాధ్యాయలను ఎండలో అడ్మిషన్ల కోసం తిప్పడంతో కొందరు ఉపాధ్యాయులు ఎండదెబ్బ తగిలి చికిత్స పొందుతున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు ప్రైవేట్ పాఠశాలలపై దృష్టి సారించి నింబధనలకు విరుద్ధంగా నడుపుతున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మ్యాడవేణి సునిల్, రంజిత్, రాఘవేంద్ర, మణికుమార్, మణిదీప్, పవన్, లక్ష్మణ్, సాయిబురమ్మ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాక అధికారి శ్రీధర్

కొడిమ్యాల, ఏప్రిల్ 6: మండలంలోని నాచుపల్లి గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పుప్పాల శ్రీధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పని తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మం డల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. మందుల స్టాక్ పొజీషన్, రికార్డులను పరిశీలించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంట మండల వైద్యాధికారి పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

జనజాతర సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

కథలాపూర్, ఏప్రిల్ 6: హైదరాబాద్‌లోని తుక్కుగూడలో శనివారం కాంగ్రెస్ ఆధ్వర్వంలో నిర్వహించిన జనజాతర సభకు కథలాపూర్ నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కాయితి నాగ రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, రాష్ట్ర ఫిషర్‌మెన్ విభాగం కార్యదర్శి కల్లెడ గంగాధర్, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పులి హరిప్రసాద్, అల్లూరి దేవన్న, లింగంగౌడ్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు

లక్ష్యంతో చదవాలి..

టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు

మల్లాపూర్, ఏప్రిల్ 6 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదివి తల్లిదండ్రులు, ఊరికి మంచి పేరు తీసుకురావాలని టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు అన్నారు. శనివారం మండలంలోని మొగిలిపేటకు చెందిన మిట్టపెల్లి సుమ ఇటీవల ఎంబీబీఎస్ పూర్తి చేసి డాక్టర్ సర్టిఫికెట్ సాధించినందున ఆమెను సన్మానించారు. మారుమూల ప్రాంతానికి చెందిన విద్యార్థులు పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో మంచి స్థానంలో నిలవాలన్నారు. భవిష్యత్తులో ప్రజలకు మంచి వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.

కుష్టువ్యాధి పై అవగాహన పెంచుకోవాలి

గొల్లపల్లి, ఏప్రిల్ 6: కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహనను పెంచుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారి డా. శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం గొల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. గత నెలలో మండల వ్యాప్తంగా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఎల్‌సీడీసీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించి మొత్తం 59 మంది కుష్టువ్యాధి గ్రస్థులను గుర్తించినట్లు తెలిపారు. వ్యాధిగ్రస్థులకు రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లెప్రసీ ఇన్‌చార్జి వేప్‌సింగ్, మండల వైద్యాధికారి డా. నరేష్, సీహెచ్‌వో శ్రీధర్, వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కోరుట్ల, ఏప్రిల్ 6 : పట్టణంలో ముత్యాల వాడలోని శ్రీలక్ష్మీనారాయణ సహిత సంతోష్ మాత ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దేవాలయాలలో ప్రత్యేక పూజలలో నిర్వహించిన పురో హితులు అర్చన అభిషేకాలను జరిపారు. ప్రత్యేక వేదిక ద్వార స్వామి వారికి కళ్యాణం నిర్వహించారు. దేవాలయ నిర్వహికులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని మొక్కులు చెల్లించి వేడుకలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

- జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత
- రైతు సమస్యలపై బీఆర్ఎస్ దీక్ష

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 6 : పంట నష్టపోయిన రైతులకు తక్షణమే రూ. 25 వేల పరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత డిమాండ్ చేశారు. క్వింటాలు వరి ధాన్యానికి రూ. 500 బోనస్‌తో మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో రైతు నిరసన దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో దండగ అన్న వ్యవసాయాన్ని పండుగ చేసి చూపించారన్నారు. కాంగ్రెస్ హయాంలో కరెంటు లేక, నీళ్ల లేక రైతులకు కన్నీళ్లే మిగుతున్నాయన్నారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధానంగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్, బీజేపీలు రెండు దొందూ దొందేనని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో వారికి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. రైతులకు మేలు జరిగేంత వరకు బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవో కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు మహేష్, మనోహర్ రెడ్డి, ఎంపీపీ సంధ్యారాణి, వైస్ ఎంపీపీ రాజేంద్రప్రసాద్, నాయకులు బా ల ముకుందం, కోల శ్రీనివాస్, నక్కల రవీందర్‌రెడ్డి ఉన్నారు.



రైతు నిరసన దీక్షలో మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్



ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో..

ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో..

ధర్మపురి: రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో కరెంట్, నీళ్ల లేక రైతులకు కష్టాలే మిగిలాయన్నారు. రైతులకు 2 లక్షలు రుణమాఫీ, రైతుబంధు రూ 15 వేలు, వరి, మొక్కజొన్న ధాన్యానికి రూ 500 బోనస్, రైతు కూలీలకు రూ 12 వేలు, కౌలు రైతుకు రూ 15 వేలు ఇస్తామని చెప్పిన హామీలో ఒక్కటి అమలు కాలేదన్నారు. పంట నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ 25 వేలు నష్టపరిహారం చెల్లించి, చనిపోయిన రైతుల కుటుంబాలకు రూ 20 లక్షలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఎండిపోయిన పంటలను సందర్శించడం కోసం రైతుల దగ్గరికి వస్తే బీజేపీకి రైతులు గుర్తుకొస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది, కరువు కూడ వచ్చిందని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తప్పకుండా గుణ పాఠం చెప్పాలన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని, రైతులు ధైర్యంగా ఉండాలన్నారు. అనంతరం తహసీల్దార్ కృష్ణ చైతన్యకు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు, రైతుబంధు మండల అధ్యక్షులు సౌళ్ల భీమయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్‌కుమార్, వైస్ చైర్మన్ అక్కెనపెల్లి సునీల్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మొ గిలి శేఖర్, పట్టణ అధ్యక్షులు ఆకుల రాజేష్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి: రైతు పక్షపాతిగా చెప్పుకుంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వ్యవసాయాన్ని పూర్తిగా ఎండగడుతోందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ విమర్శించారు. శనివారం మెట్‌పల్లి పట్టణంలో కోరుట్ల నియోజక వర్గం రైతుల కోసం చేపట్టిన రైతు దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తయినా రైతు సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు నీటి గురించి ఎలాంటి సమావేశాలు నిర్వహించలేదని, వేసవిలో తాగు, సాగుకు నీటి సరఫరాల చేయడానికి ఎలాంటి ప్రణాళికలు చేపట్టకపోవడంతోనే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని విమర్శించారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 25 వేల పరిహారం, చనిపోయిన రైతు కుటుంబాలకు రూ. 20లక్షల పరిహారం చెల్లించాలన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రావు, మాజీ సర్పంచులు ఆకుల రాజా రెడ్డి, బద్దం శేఖర్‌రెడ్డి, కట్టా శ్రీధర్, నాయకులు పుల్ల జగన్‌గౌడ్, ఓజ్జెల శ్రీనివాస్, కౌన్సిలర్లు, డివిజన్ నాయకుడు, రైతులు పాల్గొన్నారు.



మెట్‌పల్లిలోని రైతు దీక్షలో మట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

ఎంపీపీ అవిశ్వాస ఫలితంపై సందిగ్ధం!

- అయిదు రోజులు గడిచినా స్పష్టత కరువు
- ఇన్‌చార్జి ఎంపీపీని నియమించని వైనం
- కోర్టుకు వెళ్లే యోచనలో ఎంపీపీ

మల్యాల, ఏప్రిల్ 6: గత మంగళవారం మల్యాల ఎంపీపీ మిట్టపల్లి విమలపై సభ్యుల అవిశ్వాసం నెగ్గిందని ఆర్డీవో ప్రకటించినప్పటికీ ఇన్‌చార్జీ ఎంపీపీని నియమించకపోవడంతో సందిగ్ధం నెలకొంది. పది మంది ఎంపీటీసీలు ఎంపీపీపై అవిశ్వాస నోటీస్ అందించగా మంగళవారం జగిత్యాల ఆర్డీవో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో తొమ్మిది మంది పాల్గొని అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో అవిశ్వాసం నెగ్గిందని ఆర్డీవో ప్రకటించారు. అయితే అవిశ్వాసం నెగ్గిన విధానంపై ఎంపీపీ విమల అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆ ప్రక్రియ సరైంది కాదని పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే అధికారులు అవిశ్వాసం నెగ్గిన ఫలితాన్ని తాము కలెక్టర్, ఉన్నతాధికారులకు నివేదించామని అంటుండగా ఇప్పటి వరకు ఎంపీపీ స్థానంలో అధికారులు ఇన్‌చార్జీ ఎంపీపీని నియమించకపోవడం చర్చనీయంశంగా మారింది. ఫలితం ప్రకటనపై ఎంపీపీ విమల వర్గీయులు అభ్యంతరం వ్యక్తం చేస్తుండగా అధికారులు తమకు స్పష్టత ఇవ్వడం లేదని అవి శ్వాసం నెగ్గిన తీరు సరైనది కాదని కోర్టులో సవాలు చేస్తామని ఎంపీపీ విమల తెలిపారు. గతంలో కూడా ఎంపీపీ అవిశ్వాస ప్రక్రియ బ్రేక్‌కు కోర్టు నుంచి స్టే తీసుకురాగ మరో సారి కోర్టుకు వెళ్లడం మల్యాల ఎంపీపీ పీఠం రసవత్తరంగా మారినట్లు అవుతుంది. ఇన్‌చార్జి ఎంపీపీ నియామకంపై తమకు ఎలాంటి సమాచారం రాలేదని మండల పరిషత్ అధికారులు తెలిపారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా శ్రీనివాస్



వడ్డేపల్లి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

మెట్‌పల్లి, ఏప్రిల్, 6 : బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా మెట్‌పల్లికి చెందిన సీనియర్ న్యాయవాది వడ్డేపల్లి శ్రీనివా స్‌ను నియమించారు. నియామక పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ శనివారం అందజేసి శాలువలతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ జరగ బోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించడానికి త నవంతుగా కృషి చేస్తానన్నారు. నాయకులు యాదగి రిబాబు, కృష్ణమూ ర్తి, దత్తాత్రేయ, హనుమాన్లు, రాంప్రసాదు పాల్గొన్నారు.

రేపు జయంత్యుత్సవాల సమన్వయ సమావేశం

మల్యాల, ఏప్రిల్ 6: కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు జరిగే చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల నిర్వహణకు వివిధ శాఖల అధికారులతో సోమవారం సమన్వయ సమావేశం నిర్వహించనున్నారు. జయంతి ఉత్సవాలకు లక్షలాదిగా దీక్షపరులు తరలిరానుండగా అసౌకర్యాలు కలుగకుండా చేపట్టె ఏర్పాట్లపై ప్రభుత్వ శాఖల అధికారులు, దేవస్థానం అధికారులతో జగిత్యాల కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం జరుగనుంది.

ఉనికిని కాపాడుకునేందుకే బీఆర్ఎస్ ధర్నాలు

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి

మెట్‌పల్లి, ఏప్రిల్, 6 : రాష్ట్రంలో తమ ఉనికిని కాపాడుకోవడానికి రైతులపై బీఆర్ఎస్ కపట ప్రేమ చూపుతూ ధర్నాలకు పాల్పడుతుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, జలపతిరెడ్డి విమర్శించారు. శనివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న సమయంలో వరి ధాన్యం కొనుగోల్లల్లో తరుగు పెరిట 10 నుంచి 15 కిలోలు చేసినప్పుడు రైతులపై ఎందుకు ప్రేమ లేదన్నారు. ఆరు నెలల నుంచి వర్షాబావ పరిస్థితులతో రైతులు అల్లాడుతున్నారని క్రమ పద్ధతుల్లో ఏప్రిల్ 4 వరకు నీరు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం 12 టీఎంసీలు మాత్రమే ఉన్నయని, అయినా రైతులు ఇబ్బందులకు గురికాకుండా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్, కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుల సంబంధిత అధికారులతో మాట్లాడి నీళ్ల ఇప్పించారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చి న హామీలను ఇప్పటికే నేరవేర్చిందని, మిగిలి న వాటిని త్వరలోనే అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, నరేష్‌రెడ్డి, సురేష్‌గౌడ్, బాబురెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, రఘు, కిషన్ పాల్గొన్నారు.

జానపద నృత్యాలకు ఆహ్వానం

మెట్‌పల్లి, ఏప్రిల్, 6 : నేడు పట్టణంలోని ఎస్సారెస్పీ గార్డెన్‌లో నిర్వహించే శాస్త్రీయ జానపద నృత్యాలు కళా నాట్య విన్యాసాలకు కళా పోషకులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. శనివారం లలిత కళా సమితి ఆధ్వర్యంలో ఉగాది రంగస్థల నృత్య కేళి కార్యక్రమానికి సం బంధించిన ఆహ్వాన పత్రికను వారు ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ ప్రాత్రికేయుడు మొదటి న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ మృతి పట్ల సంతాపం తెలిపి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాస్త్రీయ జాన పద నృత్యాలు కళా నాట్య విన్యాసాలు నిర్వహించిన అ నంతరం సన్మాన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లలిత కళా సమితి అధ్యక్షుడు మట్టెల గంగాధర్, నవీన్ కుమార్, కోటగిరి చైతన్య, మర్రి భాస్కర్, శివానందం పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరికలు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రావణి

రాయికల్, ఏప్రిల్ 6: ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరికలు జరుగుతున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి అన్నారు. మండలంలోని ధర్మాజీపేట గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు గుగులోతు చిరంజీవి బీజేపీలో చేరగా ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జగిత్యాల నియోజకవర్గ ఎస్టీ మోర్చా ఇన్‌చార్జి తిరుపతి నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు గంగరాజం, పరశురాం, బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు సుమన్, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన కొడిమ్యాల మాజీ సర్పంచ్

కొడిమ్యాల, ఏప్రిల్ 6: కొడిమ్యాల మాజీ సర్పంచ్ దంపతులు ఏలేటి మమత నర్సింహారెడ్డి శనివారం కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ సమక్షంలో బీజేపీలో చేరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, మండల బీజేపీ అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి, నాయకులు చల్ల శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి ఉన్నారు.

ప్రైవేట్ ఉపాధ్యాయుడు ఆర్మీ ర్యాంక్‌కు ఎంపిక

కోరుట్ల, ఏప్రిల్ 6 : పట్టణంలోని గౌతమ్ ఉన్నత పాఠశాలలో పీఈటీగా పని చేస్తున్న విజయ్ నాయక్‌కు ఆర్మీ ర్యాంక్ లభించినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎంఎ గఫార్ శనివారం తెలిపారు. పాఠశాలలో గుగాలావత్ విజయ్ నాయక్ 2023 సంవత్సరం నుంచి పాఠశాలలో పీఈటీగా పని చేస్తూ విద్యార్థులకు ఎన్‌సీసీ యూనిట్ అధికారిగా విధులు నిర్వహిసున్నట్లు తెలిపారు. జనవరి 28 నుంచి మార్చి 28 వరకు మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరిగిన సైనిక శిబిరంలో విజయ్‌నాయక్ పాల్గొన్ని ఎన్‌సీసీ బెటాలియన్‌లో ఆర్మీ ర్యాంక్‌కు ఎంపికైనట్లు తెలిపారు. విజయ్ నాయక్ సైనిక శిబిరం ఎన్‌సీసీ బెటాలియన్ కమాండ్ ఆధికారి కల్నల్ దానియాల్ లార్డం, సుబేదార్ మేజర్ సాగర్ సింగ్ నుంచి ర్యాంకు అందుకున్నట్లు గఫార్ తెలి పారు. విజయ్‌నాయక్‌ను ఉపాధ్యాయులు కరస్పాండెంట్ గఫార్ అభినందించి సన్మానించారు.

ఆంజనేయ స్వామికి చందన మహోత్సవం

కోరుట్ల, ఏప్రిల్ 6 : పట్టణంలోని వీరబ్రహ్మంద్రస్వామి ఆలయంలోని జై హనుమాన్ దీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం చందన మహోత్సవం నిర్వహించారు. హనుమాన్ దీక్షలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూ జలను నిర్వహించి అభిషేక, ఆర్చన కార్యక్రమాలను చేశారు. ఆంజనేయస్వామి చందన మహోత్సవం జరిపి భజన కార్యక్రమాలను నిర్వహించారు. సామూహిక ఆంజనేయ దండకం, చాలీసా పారయణంను జరిపారు.

ప్రారంభమైన రామలింగేశ్వర స్వామి జాతర

గొల్లపల్లి, ఏప్రిల్ 6: గొల్లపల్లి మండలం చిల్వకోడూర్‌లోని శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆలయంలో శ్రీ రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కన్నులపండువలా నిర్వహించారు. ఉగాది పర్వదినంను పురస్కరించుకుని ప్రతి ఏటా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జాతర ఉత్సవాలను ఆరు రోజులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయ పూజారుల వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అనంతరం పప్పుల నారాయణ జ్ఞాపకార్థం పప్పుల అన్నపూర్ణ-వెంకన్న దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేశారు.

ప్రత్యేక పూజలు చేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ :

జాతర ఉత్సవాల్లో భాగంగా ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు, స్థానిక కాంగ్రెస్ శ్రేణులు లక్ష్మణ్‌కుమార్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌గా మొదటిసారి ఆలయాన్ని సందర్శించడంతో లక్ష్మణ్‌కుమార్‌కు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం గర్భగుడిలోని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నిశాంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ సత్యానారాయణ గౌడ్, నాయకులు సంతోష్, లింగన్న, వెంకటేశం, బుచ్చిరెడ్డి, వేణు, గంగన్న, ప్రవీణ్, మహేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్

అంతర్జాతీయ స్థాయికి దీటుగా ఫలితాలు అందిస్తున్న సంతాన సాఫల్య కేంద్రం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 6: సంతానం లేని దంపతులకు ఐవీఎఫ్ పద్ధతి ఒక వరం లాంటిదని పద్మజ సంతాన సాఫల్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ పద్మజ తెలిపారు. శనివారం ఆసుపత్రి సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యాధునిక వైద్య విధానాలు, సంతాన సాఫల్యంలో అద్భుత ఫలితాలు సాధించడం కరీంనగర్‌లోని పద్మజ సంతాన సాఫల్య కేంద్రానికే దక్కుతాయన్నారు. 25 సంవత్సరాల క్రితం కరీంనగర్‌లో ప్రారంభమైన పద్మజ సంతాన సాఫల్య కేంద్రంలో అంతర్జాతీయ స్థాయికి ధీటుగా ఫలితాలు ఇస్తున్న సంతాన సాఫల్య కేంద్రం తమదేనని అన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా దేశ విదేశాల నుంచి వచ్చి సంతానం పొందిన దంపతులు వేల సంఖ్యలో ఉన్నారని తెలిపారు. ఒకే రోజులో ఒకే కాన్పులో ఇద్దరు, ముగ్గురు సంతానం కలిగిన దంపతులు ఉన్నారని తెలిపారు. వారం దరినీ ఈరోజు ముందుకు తీసుకు వచ్చామన్నారు. పిల్లలు లేని దంపతులకు స్త్రీ, పురుషుల పునరుత్పత్తి వ్యవస్థ ద్వారా ఐవీఎఫ్ ఒక అద్భుత వరమన్నారు. ఐవీఎఫ్ విధానంలో భార్య అండాశయం నుంచి అండాలను బయటకు తీసి, భర్త వీర్యకణాలను అండంలోకి ఇంజెక్ట్ చేసి ఇంక్యుబేట్ చేస్తామని తెలిపారు. మూడు రోజుల తరువాత ఫలదీకరణ చెందిన పిండాన్ని తిరిగి గర్భాశయంలో ప్రవేశ పెడుతామని పేర్కొన్నారు. ఐవీఎఫ్ పద్ధతి కోసం వినియోగించే పరికరాలు అన్నీ విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నవేనని తెలిపారు. అయితే వాటితో వైద్యం చేయడం కూడా ఖర్చుతో కూడుకున్నదన్నారు. అంతర్జాతీయ సక్సెస్ రేటు 35 శాతం నుంచి 40 శాతం కాగా, ఇక్కడ 70 నుంచి 75 శాతం సక్సెస్ ఇస్తున్నామన్నారు. తమ సక్సెస్ రేటును చూసే దేశ విదేశాల నుంచి తమ వద్దకు సంతానం కోసం వస్తున్నారని తెలిపారు. గర్భధారణ అయినవారి కళ్లల్లో ఆనందం చూశాక తాము పడిన శ్రమ మర్చిపోయి తిరిగి మరింత ఉత్సాహంగా పనిచేయాలనిపిస్తుందన్నారు.

ఈ పద్ధతి గురించి ఎన్నో అపోహలు, ఆటంకాలను దాటుకొని ఫర్టిలిటీలోని ఆధునిక పద్ధతులను అనుసరిస్తూ మాతృత్వాన్ని ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం ఎన్నో ఐవీఎఫ్ సెంటర్లు ఉన్నప్పటికీ వస్తున్న ఫలితాలే తమ అభివృద్ధికి సోపానాలని పేర్కొన్నారు.



పద్మజ సంతాన సాఫల్య కేంద్రంలో ఒకే రోజు ఐవీఎఫ్ పద్ధతి ద్వారా మాతృత్వం పొందిన మహిళలు